క్లుప్తంగా

సిరులతల్లికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారికి తులసీ పూజ..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

పొగాకు నిర్మూలనకు సంతకాల సేకరణ



పొగాకు నిర్మూలన కోరుతూ సంతకం చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: పొగాకు నిర్మూలనకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. శుక్రవారం రేసవానిపాలెంలో ఉన్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు సంతకం చేశారు. పొగాకు వాడకానికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు, వ్యసనాల దుష్పరిణామాలు తెలియజేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి ఉద్యోగి పొగాకు నిర్మూలనకు కట్టుబడి పని చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో కార్యాలయ ప్రోగ్రామ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 11 వినతులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో శుక్రవారం నిర్వహించిన టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 11 వినతులు అందాయి. చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు ఫిర్యాదులు స్వీకరించారు. అందిన ఫిర్యాదులు నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో సీపీలు, డీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం వేతనాలు కోరుతూ బైక్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న జీవీఎంసీ వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ సభ్యులు

బీచ్‌రోడ్డు: ప్రస్తుత ధరల ప్రకారం ఒక కుటుంబం బతకడానికి కనీసం రూ. 26 వేలు ఖర్చు అవుతుందని, కానీ కేవలం రూ. 13 వేలతో పట్టణాల్లో ఎలా జీవించాలని ప్రభుత్వాన్ని జీవీఎంసీ వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా 12వ తేదీ నుండి సమ్మె చేస్తున్న సందర్భంగా శుక్రవారం గాంధీ విగ్రహం వద్ద ప్లాంట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకత్వంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి. వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కనీస వేతన చట్టం ప్రకారం ప్రతి ఐదేళ్లకు ఒకసారి అప్పటి ధరల ప్రకారం డీఏతో కూడిన వేతనాలు నిర్ణయించాలన్నారు. జీవో 36 ప్రకారం అన్‌స్కిల్డ్ కార్మికులకు రూ. 21 వేలు, సెమీ స్కిల్డ్ కార్మికులకు రూ. 24,500 చెల్లించాలన్నారు. కార్మిక వర్గం అంతా సమ్మెను జయప్రదం చేయాలని కోరుతున్నామన్నారు. ఈ బైక్ ర్యాలీలో ప్లాంట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవ అధ్యక్షుడు పి. వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షుడు గండి రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ కనకరాజు, జాయింట్ సెక్రెటరీ మహేష్, కోశాధికారి కె. వెంకట్రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ రాజు, జాయింట్ సెక్రెటరీ గండి రమణ, వైస్ ప్రెసిడెంట్ మహేష్, జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు, కార్యదర్శులు టి. నూకరాజు, ఉరికిటి రాజు తదితరులు పాల్గొన్నారు.

‘బెల్ట్’ బాధ.. మహిళల వ్యధ

పాతనగరంలో ఏరులై పారుతున్న మద్యం

అడుగుకో బెల్ట్ దుకాణంతో సంసారాలు గుల్ల

మందుబాబుల వీరంగంతో మహిళల ఆందోళన

జగదాంబ: పాతనగరంలో మద్యం ఏరులై పారుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత బెల్ట్ దుకాణాల సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయిందని మహిళలు వాపోతున్నారు. దీంతో పాటు బార్లకు తప్ప మద్యం దుకాణాలకు డ్రింకింగ్ రూమ్‌ల పర్మిషన్ ఇవ్వకపోవడంతో బహిరంగ ప్రదేశాల్లోనే మందుబాబులు మద్యం తాగి వీరంగం సృష్టిస్తున్నారు. లైసెన్స్‌డ్ దుకాణాల నుంచి మద్యం తీసుకొచ్చి వీధుల్లో చిన్నచిన్న దుకాణాల్లో పెట్టి విక్రయాలు చేస్తున్న వారి సంఖ్య కూడా ఎక్కువే. ఈ విధంగా ఏర్పాటు చేస్తున్న మద్యం బెల్ట్‌షాపుల్లో అసలు ధర కంటే అధిక ధరకు మద్యం విక్రయిస్తున్నా పట్టించుకున్న నాథుడే లేకపోయాడు. కూటమి ప్రభుత్వంలో సంక్షేమం పక్కన పెడితే మందు మాత్రం వరదలా పారుతూ ప్రతి ఇంటిని సంక్షోభంలోకి నెడుతోందని మహిళలు ఆరోపిస్తున్నారు.

నిబంధనలకు పాతర..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం బెల్ట్ దుకాణాలు నిర్వహించడం నేరం అయినప్పటికీ పరపతి ఉన్న పలువురు సిండికేట్లు దుకాణాలు దక్కించుకుని ఇష్టారాజ్యంగా వ్యాపారాలు చేస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత శాఖాధికారులు ఒత్తిళ్లకు తలొగ్గి మిన్నకుండిపోతున్నట్లు సమాచారం. దీనిని ఆసరాగా తీసుకున్న సిండికేట్ వ్యాపారులు దుకాణాల కంటే బెల్ట్ షాపుల నుంచే ఎక్కువ డబ్బులు చేసుకుంటున్నారు. ప్రతి బ్రాండ్‌పైన కనీసం రూ. 50 నుంచి రూ. 100 వరకు లాభం వేసుకుని విక్రయించడం ద్వారా రూ. లక్షల్లో ఆర్జిస్తున్నట్లు వినిపిస్తోంది.



రహదారే వీరికి సిటింగ్ రూమ్

రహదారుల పక్కనే..

బెల్ట్ దుకాణాల సంగతి పక్కన పెడితే పాతనగరంలో చాలా ప్రాంతాల్లో రహదారులు డ్రింకింగ్ రూమ్‌లను తలపిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. వైన్ షాపుల పక్కనే బహిరంగ ప్రదేశాల్లో మందు బాబులు దర్జాగా మద్యం సేవిస్తున్నారు. దీంతో బయటికి రావాలంటేనే భయపడాల్సి వస్తుందని స్థానిక మహిళలు వాపోతున్నారు. పూర్ణామార్కెట్, టౌన్ కొత్త రోడ్డు, రామకృష్ణా జంక్షన్ వంటి ప్రాంతాల్లో ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉందంటున్నారు. ప్రభుత్వం నిర్ణీత సమయంలో దుకాణాలు మూసేయాలని కచ్చితమైన నిబంధనలు పెట్టినా అవి ఎక్కడా అమలు కావడం లేదని మండిపడుతున్నారు.



పాతనగరంలో ఒక మద్యం బెల్ట్ దుకాణం

ఏవీ చర్యలు?

వీధుల్లో బెల్ట్ దుకాణాల ద్వారా మద్యం విక్రయిస్తున్నట్లు **ఫిర్యాదులు వచ్చినా ఎలా**ంటి చర్యలు లేవని **ఆరోపణలు వినిపిస్తున్నాయి.** రాత్రి సమయంలో **మందుబాబులతో ఇబ్బందు**లు ఎదుర్కొంటున్న **విషయం పలుమార్లు సంబం**ధిత అధికారులకు **తెలియపరిచామని స్థానికులు** చెబుతున్నారు. అయినప్పటికీ మందు బాబుల బాధ తప్పలేదని విచారం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 35వ వార్డు పరిధిలోని పండావీధి, కల్లుపాకలు, మంచాలవీధి, వెలంపేట ప్రాంతాల్లో మద్యం 24/7 రీతిలో ఏరులై పారుతోందని మహిళలు చెబుతున్నారు. రోజంతా కష్టపడి సంపాదించిన సొమ్ము తమ మగవాళ్లు మద్యానికే పోస్తున్నారని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వన్‌టౌన్ ఏరియాలో బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న మందుబాబులు

రాచపోలమాంబకు సారె సమర్పణ



అమ్మవారికి సారె నివేదించి పూజలు చేస్తున్న మహిళలు

అల్లిపురం: స్థానికుల ఆరాధ్య దైవం రాచపోలమాంబ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా అమ్మవారికి బంగారుమెట్ట మహిళలు భారీ ఎత్తున శుక్రవారం సారె సమర్పించారు. కుమ్మరివీధిలో అమ్మవారి పుట్టింటి నుంచి డప్పు వాయిద్యాలు, పసుపు, కుంకుమ, చీర, కొబ్బరి బొండాలు, పలు రకాల స్వీట్లతో తిరువీధి నిర్వహిస్తూ అమ్మవారి సతకం పట్టువద్ద గల దేవాలయంలో సారె అందజేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదం అందజేశారు.

నేడు సత్తమ్మ వారి పండగ..

రాచపోలమాంబ అమ్మవారి ఉత్సవాలలో భాగంగా శనివారం సత్తమ్మ పండగ ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. భక్తులు అమ్మవారికి పసుపు కుంకమలు అందజేయాలని కోరారు.

నేడు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

జగదాంబ: జీవీఎంసీ 39వ వార్డులో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ సౌత్ మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ యాసీన్ బాజ్జీ శుక్రవారం తెలిపారు. శనివారం వార్డులోని మత్స్యకార భవనంలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వరంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కంటి సమస్యలు ఉన్న వారందరూ శిబిరానికి హాజరు కావాలన్నారు. కంటి పరీక్షలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. ఎవరికైతే శస్త్ర చికిత్సలు అవసరమో వారికి ఉచితంగా చికిత్స చేస్తారని బాజ్జి తెలిపారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగం కార్యదర్శిగా పూర్ణిమ



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో కోడిగుడ్ల పూర్ణిమ

కంచరపాలెం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగం కార్యదర్శిగా 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హయంలో 41వ వార్డు కార్పొరేటర్‌గా కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు చేయగలిగామంటే మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రోత్సాహమే కారణం అన్నారు. తనపై నమ్మకంతో పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి అందించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పార్టీకి పూర్వవైభం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని పూర్ణిమ తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ పెద్దలు బొత్స సత్యనారాయణ, కురసాల కన్నబాబు, వాసుపల్లి గణేష్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజుకి ధన్యవాదాలు తెలిపారు. తన వెన్నంటే నడిచిన కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటామని వెల్లడించారు. వార్డు ప్రజలకు రుణపడి ఉంటామని తెలిపారు. తమ నాయకుడు వాసుపల్లి గణేష్‌కుమార్‌ని ఈసారి కచ్చితంగా ఎమ్మెల్యేగా అఖండ మెజార్టీతో గెలిపించుకుని మంత్రిగా చూడాలన్నదే తమ ఆకాంక్ష అన్నారు. అలాగే వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తామని కోడిగుడ్ల పూర్ణిమ తెలిపారు.

మహిళా కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవం



వ్యాస రచన, వక్తృత్వ పోటీల విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపకులు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. కళాశాల ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల పాల్గొని మాట్లాడారు. విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారత వంటి అంశాల్లో మనం ముందుకు వెళ్తే, జనాభా పెరుగుదల లాభాలను వాస్తవ అభివృద్ధిగా మలచగలమని పేర్కొన్నారు. ఎకనామిక్స్ విభాగం ఇన్‌చార్జి డాక్టర్ కేఎల్ శిరీష జనాభా నియంత్రణలో యువత పాత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో భాగంగా జనాభా పెరుగుదల-సవాళ్లు-అవకాశాల వంటి విషయాలపై విద్యార్థులు మాట్లాడారు. జనాభా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు పోస్టర్ ప్రెజెంటేషన్ చేశారు. ఏయూ పాపులేషన్ రీసెర్చి విభాగం నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో సీహెచ్ జాజి, ఎస్.తులసి, సీహెచ్ ప్రేమలత, సీహెచ్ దీపిక బహుమతులు పొందారు. కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.గీతాంజలి, డాక్టర్ ఆర్.కిరణ్మయి, ఎస్.రాజేష్ అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

యోగా, ప్రకృతి వైద్యంతో సంపూర్ణ ఆరోగ్యం



డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ శ్రీలక్ష్మి దంపతులను సత్కరిస్తున్న బీజేపీ నేత ప్రకాష్‌రెడ్డి

మహారాణిపేట: బీజేపీ వైద్య విభాగం, శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ అకాడమీ సంయుక్త నిర్వహణలో మహారాణిపేటలోని నేచర్ క్యూర్ ఆస్పత్రిలో ప్రకృతి వైద్యం, యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు దేవర చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు ప్రకాష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ ఎస్. లక్ష్మీనారాయణ, డాక్టర్ ఎస్. శ్రీలక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ప్రకృతి వైద్యం, యోగ రుషుల కాలం నుంచి ఉన్నాయన్నారు. డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వంద సంవత్సరాలకు పైగా ప్రకృతి వైద్యశాల ఇక్కడ నిర్వహిస్తున్నారని తెలిపారు. పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉందన్నారు. మానసిక ప్రశాంతత, కీళ్ల నొప్పులు, బరువు తగ్గటం, పలు వ్యాధుల నుంచి నివారణ పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్, రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి బి. శ్రీహరిరావు, పార్టీ నగర ఉపాధ్యక్షుడు చొక్కాకుల రాంబాబు, తలాడ గిరిజ, మైనార్టీ మోర్చా నాయకులు ఒ. ఆల్బర్ట్, సీహెచ్ రాజబాబు, ఎస్. మహేష్, పల్లా చలపతి, డాక్టర్ లక్ష్మణ్, మెహర్‌బాబా, సుశీల, శారద, తోటమ్మ, చంద్రావతి, మణికుమార్, పల్లా సాయి, రజియా బేగం, మరగడ గౌరీ రెడ్డి, రమ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ పార్కులు, ఖాళీ స్థలాలను పరిరక్షించాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ శ్రీనివాసరావు

మహారాణిపేట: జీవీఎంసీ పార్కులు, ఖాళీ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని మేయర్ పీలా శ్రీనివాసరావు రెవెన్యూ, పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో జీవీఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులు, రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని జీవీఎంసీ పార్కులు, ఖాళీ స్థలాలు ఆక్రమణకు గురి కాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. నగరంలో చాలా వరకు ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని వాటిని నియంత్రణించాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలో పార్కులు, ఖాళీ స్థలాలు ఎన్ని ఉన్నాయో, ఎన్ని ఆక్రమణకు గురయ్యాయో, అభివృద్ధి చేసిన పార్కులు, పరస్పర బదలాయింపు ద్వారా మార్పిడి చేసిన స్థలాల పూర్తి నివేదిక సోమవారం నాటికి అందించాలన్నారు. ఖాళీ స్థలాలు, పార్కులపై తప్పుడు సమాచారం ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులను హెచ్చరించారు. పార్కులు, ఖాళీ స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామన్నారు. ఈ సమీక్ష సమావేశంలో చీఫ్ సిటీ ప్లానర్ ఎ. ప్రభాకర్, డీసీ (ఆర్) ఎస్. శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ మీనా కుమారి, డిప్యూటీ సిటీ ప్లానర్లు ధనుంజయరెడ్డి, హరిదాస్ రామ్మోహన్, రెవెన్యూ ఆఫీసర్లు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు, పట్టణ ప్రణాళిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన తప్పనిసరి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: ఆరోగ్య కేంద్రాల్లో పని చేసే ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు కుటుంబ నియంత్రణ పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి. జగదీశ్వరరావు అన్నారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. రేసవానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద మొదలైన ర్యాలీ సత్యం జంక్షన్ మీదుగా తిరిగి డీఎంహెచ్‌వో కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడతూ గర్భిణులకు పోషకాహార ప్రణాళిక గురించి తెలియజేయాలన్నారు. అలాగే నిర్దేశించిన సమయంలో వ్యాక్సినేషన్ చేయించాలని తెలపాలన్నారు. జిల్లా మీడియా విస్తరణాధికారి (డెమో) బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ టీనేజీలో గర్భం దాల్చకుండా చూసుకోవాలని, వివాహ వయస్సు 20 సంవత్సరాలు దాటితే మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి బి.విజయలక్ష్మి, జిల్లా ఎయిడ్స్ నివారణాధికారి డాక్టర్ ఆర్. రమేష్, వైద్య ఆరోగ్యశాఖ పలు విభాగాల ప్రాజెక్టు అధికారులు డాక్టర్ హారిక, డాక్టర్ ఎస్.వి.సమత, శోభిభూషణ్, మలేరియా నివారణ, టీబీ సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సిబ్బంది, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాలతోనే మత్స్యకారుల అభివృద్ధి



మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి ప్రవీణ

మహారాణిపేట: మత్స్యకారుల అభివృద్ధిలో సహకార సంఘాలు కీలక పాత్ర వహిస్తున్నాయని జిల్లా సహకార అధికారి (డీసీవో) ప్రవీణ అన్నారు. శుక్రవారం ఫిషింగ్ హార్బర్ రోడ్డులో ఉన్న ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా కార్యాలయంలో యునైటెడ్ నేషన్స్ ఇయర్ ఆఫ్ కోపరేటివ్-2025ను పురస్కరించుకుని విశాఖ జిల్లా మత్స్య సహకార సంఘాల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. సహకార సంఘాల నిర్వహణ, ఆడిట్, సంఘాల అభివృద్ధికి అవగాహన కల్పించారు. మత్స్యశాఖ జేడీ పి.లక్ష్మణరావు మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల అధ్యక్షుడు ఎం.గురునాథరావు, జిల్లా మత్స్య సంఘం ఉపాధ్యక్షుడు ఆదిబాబు, ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులు ధనుంజయరావు, ప్రసాద్, మత్స్యశాఖ ఏడీ విజయకృష్ణ, మత్స్యశాఖ అధికారి ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జనాభా పెరుగుదల, సవాళ్లపై పోటీలు



బహుమతులు పొందిన విద్యార్థులతో అధ్యాపకులు

భీమునిపట్నం: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమిలిలోని జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) వద్ద శుక్రవారం జిల్లా స్థాయి పోటీలు జరిగాయి. జిల్లాలోని 20 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ ఎల్. సుధాకర్ పర్యవేక్షణలో వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. వీరిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.1200, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.1000, తృతీయ స్థానం పొందిన వారికి రూ.750 చొప్పున నగదు బహుమతులు అందజేశారు. చిత్రలేఖన పోటీల్లో ప్రకాశరావుపేటకు చెందిన బి.ధనుష్ ప్రథమ, చిట్టివలసకు చెందిన కె.వినీల ద్వితీయ, బుచ్చెంపేటకు చెందిన ఇ.లలిత తృతీయ స్థానంలో నిలిచారు. వ్యాస రచన పోటీల్లో చిట్టివలసకు చెందిన ఆర్.కార్తిక్ ప్రథమ, బుచ్చెంపేటకు చెందిన ఎస్.భాగ్యశ్రీ ద్వితీయ స్థానం, ప్రకాశరావుపేటకు చెందిన ఎస్.వివంజలిన్ తృతీయస్థానంలో నిలిచారు. వీరికి ప్రిన్సిపాల్ సుధాకర్ నగదు బహుమతులు అందించి అభినందించారు.

ఫస్ట్ రిఫరల్ ఆస్పత్రిని ప్రైవేట్‌కు ఇవ్వొద్దని వినతి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ఆధీనంలో ఉన్న ఆరిలోవ, మల్కాపురం(శ్రీహరిపురం) ఫస్ట్ రిఫరల్ హాస్పిటళ్లు గత 30 ఏళ్లుగా నడపబడుతున్నాయని, ప్రస్తుతం శ్రీహరిపురంలో ఉన్న ఎఫ్‌ఆర్‌యూను 30 ఏళ్లకి మురగొప్ప గ్రూప్‌కి సంబంధించి కోరమండల్ ఫెర్టిలైజర్ కంపెనీకి ఇవ్వాలనే చర్చలు జరుగుతున్నట్టు తెలుస్తోందని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్‌కి ఇవ్వొద్దంటూ జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్‌లీడర్ డాక్టర్ బి.గంగారావు శుక్రవారం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. వైద్య సేవలకు కోరమండల్ కంపెనీ ఛార్జీలు వసూలు చేసుకోవడానికి ప్రాథమికంగా జీవీఎంసీ అంగీకరించినట్టు తెలిసిందని, ఈ ప్రతిపాదనలు ప్రజలకు తీవ్ర హాని చేస్తాయన్నారు. జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదం లేకుండా ఈ ప్రతిపాదనలు ముందుకు తీసుకు రావడం చట్ట విరుద్ధమని, శ్రీహరిపురం ఎఫ్‌ఆర్‌యూను ప్రైవేట్ సంస్థకు ఇవ్వాలనే ప్రతిపాదనలు వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. శ్రీహరిపురం ఎఫ్‌ఆర్‌యూ అద్భుతమైన వైద్య సదుపాయాలు కలిగి ఉందని, కోవిడ్ సమయంలో ప్రశంసనీయమైన సేవలు అందించిందన్నారు. సుమారు రెండెకరాల స్థలంలో నిర్మాణం చేయబడిందని, మల్కాపురం పారిశ్రామిక ప్రాంత 7 వార్డుల్లో 2 లక్షల మంది ప్రజలకు ఏకైక ప్రభుత్వ ఆస్పత్రి అదే అని తెలిపారు. ఈ ఆస్పత్రి 30 పడకలతో, అధునాతన ఆపరేషన్ థియేటర్, డెలివరీలు, శస్త్ర చికిత్సలు చేసే సదుపాయం, ఎక్స్‌రే యూనిట్, 100 రకాల రక్త పరీక్షలు చేసే మెడికల్ ల్యాబ్, అంబులెన్స్, ఉచిత మందుల సదుపాయం, ముగ్గురు వైద్యులు, వారం వారం స్పెషలిస్టులు, 16 మంది వైద్య సిబ్బందితో 24 గంటలు పని చేసే సదుపాయం కలిగి ఉందన్నారు. ఇటువంటి ఆస్పత్రిని గత కొంత కాలం నుంచి అనాథ శరణాలయంగా మార్చేశారని, ఆపరేషన్ థియేటర్, ఎక్స్‌రే యూనిట్, మెడికల్ ల్యాబ్‌లు మూసివేశారని, డెలివరీలు, శస్త్ర చికిత్సలు నిలిపివేశారన్నారు. ఆస్పత్రిని పాలకులు నిలువునా నిర్వీర్యం చేశారని ఆ వినతిలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఏకంగా ప్రైవేట్‌కు ఇవ్వాలనుకోవడం ప్రజల ఆరోగ్యాన్ని ప్రైవేట్ లాభాలకు పణంగా పెట్టడమేన్నారు. మల్కాపురంలో ఉన్న హెచ్‌పీసీఎల్, షిప్‌యార్డ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, కోరమండల్, ఆంధ్రా పెట్రో కెమికల్ వంటి ప్రైవేట్ రంగ పరిశ్రమల నుంచి సీఎస్‌ఆర్ కింద కనీసం రూ.20 కోట్లు సమీకరించి, ఆస్పత్రిని 100 పడకలుగా మార్చి, ఆరోగ్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీ సిబ్బంది సేవలు భేష్



సింహాచలం ఆర్టీసీ డిపోలో మాట్లాడుతున్న ఆర్‌ఎం అప్పలనాయుడు

గోపాలపట్నం: సింహాచలం గిరి ప్రదక్షిణలో భక్తులకు సేవలు అందించిన ఆర్టీసీ సిబ్బందిని రీజినల్ మేనేజర్ అప్పలనాయుడు అభినందించారు. ఈ మేరకు శుక్రవారం సింహాచలం ఆర్టీసీ డిపోలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులను తరలించడంలో ఏపీఎస్ ఆర్టీసీ కీలక పాత్ర పోషించిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారని తెలిపారు. సింహాచలం కొండ నుంచి తొలి పావంచా వరకు 55 బస్సులు, మిగతా ప్రాంతాలకు 150 బస్సులు తిప్పామని తెలిపారు. ఎక్కడా ఎవరికి ఇబ్బంది కలగకుండా సేవలు అందించిన సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డ్రైవర్లు, కండక్టర్లతో పాటు మెకానిక్‌లకు అవార్డులు ప్రకటించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శరత్, అసిస్టెంట్ మేనేజర్ రమణమూర్తి, ఏఈలు సుధారాణి, కొండలరావు, అసోసియేషన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించండి



జెండా చెట్టువీధిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

అల్లిపురం: పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని జోన్-4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు తెలిపారు. డెంగ్యూ నివారణ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం 34వ వార్డు జెండా చెట్టు ప్రాంతంలో ఏర్పాటు చేసిన డ్రై డే - ఫ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. మనీప్లాంట్లు, ఫ్రిజ్‌లో వేస్ట్ బాక్సులలో నీటిని ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలని, ఇంటి ఆవరణలో పాత టైర్లు, వాడేసిన కొబ్బరిబొండాలు, విరిగిన నీళ్ల కుండీలు, పాత డ్రమ్ములు, రుబ్బురోళ్లలో నీటిని ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలని తెలిపారు. బయాలజిస్ట్, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ కృష్ణంరాజు, మలేరియా ఇన్‌స్పెక్టర్ రాంబాబు, సెక్రటరీలు, మలేరియా సిబ్బంది, ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.